క్లుప్తంగా

ఫలితాలపై పందాలు

భాకరాపేట: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఫలితాలపై బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ముఖ్యంగా చంద్రగిరి స్థానంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందనే దానిపై అందరి చూపు కేంద్రీకృతమైంది. ఓటింగ్ సరళిని బట్టి మంచి మెజారిటీతోనే గెలుపోటములు ఉంటాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బెట్టింగ్ రాజాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. అధికార వైఎస్‌ఆర్ సీపీ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై రూ.లక్షల్లో బెట్టింగులు పెట్టినట్లు చెప్పుకొంటున్నారు. చిన్నగొట్టిగల్లుకు చెందిన కొంత మంది బెల్లం వ్యాపారులు ఈ బెట్టింగ్ వ్యవహారంలో గుట్టుగా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని కొందరు, మరో ప్రధాన పార్టీ గెలుస్తుందని మరి కొందరు బెట్టింగ్‌లోకి దిగిపోయినట్లు తెలుస్తోంది. కొస మెరుపు ఏంటంటే ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు వైఎస్‌ఆర్ సీపీ గెలుస్తుందని బెట్టింగ్ కట్టినట్లు సమాచారం.

ఇద్దరికి డాక్టరేట్ ప్రదానం


కంపా రాజేష్


వి.చంద్రప్ప

తిరుపతి సిటీ: ఎస్వీయూ అర్థశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కంపా రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ ఎం దేవరాజులు పర్యవేక్షణలో ట్రెండ్స్ అండ్ సప్లై రెస్పాన్స్ బిహేవియర్ ఆఫ్ మేజర్ ఫుడ్ అండ్ నాన్ ఫుడ్ క్రాప్స్ ఇన్ రాయలసీమ రీజన్ ఆఫ్ ఏపీ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. అదే విధంగా భౌతిక శాస్త్ర పరిశోధక విద్యార్థి వి.చంద్రప్పకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ సీకే జయశంకర్ పర్యవేక్షణలో కాంపోజిషన్ డిపెండెంట్ వైట్‌లైట్ ఎమిషన్ స్టడీస్ ఆఫ్ డోప్డ్ ఆక్సైడ్ అండ్ ఆక్సీఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ లైటింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి రూరల్, అవిలాల, ధనలక్ష్మి నగర్‌కు చెంది, స్థానిక ఎస్పీ ఆఫీసులో ఉద్యోగిగా ఉన్న షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరఫు న్యాయవాది పులికొండ బాలాజీ తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి, జీవకోన, అరుణోదయ నగర్‌కు చెందిన బి.రామమూర్తి వద్ద మహమ్మద్ అలీ 2020 సెప్టెంబర్ 10వ తేదీన 10 లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని ప్రోనోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 2021 సెప్టెంబర్ 23వ తేదీన రామమూర్తికి ఓ చెక్కును ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో అతను షేక్ మహమ్మద్ అలీపై కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించి షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే పది లక్షల రూపాయల చెక్కు సొమ్మును పరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

న్యాయవాది ఆకస్మిక మృతి


బి.దామోదర శర్మ

తిరుపతి లీగల్: తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న బి.దామోదర శర్మ శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన తిరుపతిలో 25 సంవత్సరాలకు పైగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన శ్రీ గాలిగోపురం మఠం అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన మృతిపై పలువురు న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు బ్రహ్మంగారి రథోత్సవం



తిరుపతి కల్చరల్ : నగరంలోని అన్నారావు సర్కిల్ వద్ద వెలసి ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ, సిద్ధయ్య మూలవర్లకు మహాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళా భక్తులు పిండి దీపారాధన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం ఉదయం ప్రత్యేక పూజలు ఉంటాయని, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం జరుగుతుందని పూజారి లక్ష్మీపతి తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు ఇతోధికంగా సాయం చేయాలని కోరారు.

హంస వాహనంపై గోవిందుని వైభవం


సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీగోవిందరాజస్వామి


చిన్న శేష వాహనంపై ఊరేగుతూ దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి స్వామివారు సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై కొలువై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటల స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి చిన్నశేష వాహన సేవ వేడుకగా సాగింది. వాహన సేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారిని కీర్తించారు. అనంతరం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, భక్తులు పాల్గొన్నారు.







స్వామి వాహన సేవలో కళా బృందాల ప్రదర్శనలు

శాస్త్రోక్తంగా తిరుపతి గంగమ్మకు పూజలు



భాకరాపేట: శాస్త్రోక్తంగా తిరుపతి గంగమ్మకు శుక్రవారం పూజలు నిర్వహించారు. వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక దీపాలంకరణ చేసి, భక్తులు భక్తి పాటలను ఆలపించారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

చంద్రగిరిలో భారీ వర్షం


చంద్రగిరిలో వీధుల్లోకి చేరిన వర్షపు నీరు

చంద్రగిరి: ఎండవేడిమితో నెల రోజులుగా చంద్రగిరివాసులు ఉక్కపోతకు గురై అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో రుతుపవనాల పుణ్యమా అని మూడు రోజులుగా ఎండ తీవ్రత తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. విపరీతమైన ఎండ వేడిమికి ప్రజలంతా ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1 గంటకు ఒక్కసారిగా వాతావరణం మార్పు చెందింది. 2 గంటల నుంచి సుమారు గంటకు పైగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో చంద్రగిరి తడిసి ముద్దైంది. మండల వ్యాప్తంగా పలు వీధులు, కాలువలు వర్షంతో పొంగిపొర్లాయి. సూర్య ప్రతాపం నుంచి తమకు ఉపశమనం కలిగిస్తూ వరుణ దేవుడు పలకరించడంతో ప్రజల కాస్త ఊరట చెందారు. మరో నాలుగు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ తీపి కబురు అందించడం విశేషం

రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, దీర్ఘకాలికంగా సంతానం లేని వారికి ఉచిత కన్సల్టేషన్‌తోపాటు స్కానింగ్, వీర్య పరీక్ష ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఐయుఐ, ఐవీఎఫ్ పరీక్షలపై 50 శాతం రాయితీ ఉన్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని స్థానికులతోపాటు చుట్టు పక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చెన్నయ్ శంకర నేత్రాలయం ఆస్పత్రి వారి మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్‌కార్డుతో హాజరవ్వాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

గంగమ్మకు సారె


గంగమ్మ తల్లికి సారెను తీసుకువస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్: గంగ జాతర సందర్భంగా నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు సాంప్రదాయ సారెను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. 11వ డివిజన్‌లోని కార్పొరేటర్ నివాసంలో అమ్మవారి సారెకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి డప్పులు, దరువులతో గంగమ్మ ఆలయానికి ఊరేగింపుగా విచ్చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకొని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ వేర్వేరుగా ఆలయానికి విచ్చేసి శ్రీతాతయ్యగుంట గంగమ్మని దర్శించుకొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.


గంగమ్మను దర్శించుకుంటున్న నగర మేయర్ డాక్టర్ శిరీష


గంగమ్మ సేవలో డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ

మార్కెట్‌లోకి కొత్త స్విఫ్ట్ కారు


కారును విడుదల చేస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం వెంకటేశ్వరరావు, భార్గవి ఆటో మొబైల్స్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటో మొబైల్స్ షోరూంలో శుక్రవారం సాయంత్రం సరికొత్త స్విఫ్ట్ కారు జెడ్ సిరీస్ ఇంజన్‌తో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ బ్యాంక్ ఆర్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. భార్గవి ఆటో మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొండా నిరంజన్‌రెడ్డి , ఈడీ కొండా ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సరికొత్త స్విఫ్ట్ కారుకు ఇప్పటి వరకు మార్కెట్‌లో 29 లక్షల కస్టమర్లు హ్యాపీనెస్ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్షియర్స్, ఇన్సూరెన్స్ సిబ్బంది, భార్గవి ఆటో మొబైల్స్ సీజీఎం, సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయంగా అరెస్టు చేశారు


మాట్లాడుతున్న కామసాని సాంబశివారెడ్డి భార్య రోహిణీ, కుటుంబసభ్యులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ గడ్డకిందపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల భాస్కర్‌రెడ్డి, కామసాని సాంబశివారెడ్డిలను అన్యాయంగా అరెస్టు చేశారని వారి కుటుంబ సభ్యులు వాపోయారు. శుక్రవారం గడ్డకిందపల్లిలో విలేకరుల సమావేశంలో ఎద్దుల భాస్కర్‌రెడ్డి తల్లి నీలమ్మ మాట్లాడారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఘటన సమయంలో తన కుమారుడు తమ గ్రామ సమీపంలోని పాలకోవా ఫ్యాక్టరీలో ఉన్నట్లు తెలిపారు. ఆ ఘటనకు ఎలాంటి సంబంధం లేకపోయినా పోలీసులు విచారణ కోసం పిలిచి అక్రమ కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన కామసాని సాంబశివారెడ్డి భార్య రోహిణి మాట్లాడుతూ తన భర్తను పోలీసులు తీసుకువెళ్లి 3 రోజులు గడుస్తున్నా ఎక్కడ ఉన్నాడో ఆచూకీ తెలియరాలేదన్నారు. కక్షతోనే తన భర్తపై తప్పుడు కేసు బనాయించారని, దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేసి తమకు న్యాయం చేయాలన్నారు.

● శేషాచలంపై మంచు తెరలు





అసలే మండుతున్న ఎండలకు జనం అల్లాడిపోతున్న విషయం తెలిసిందే. అయితే ప్రజలకు కాసింత ఊరట కలిగేలా నగరంలో మోస్తరుగా చిరుజల్లులు కురిశాయి. అదే క్రమంలో శేషాచలంపై మంచు తెరలు కమ్ముకున్నాయి. తిరుపతి గంగజాతర కావడంతో ఇలా నగరంలో చల్లటి వాతావరణం ఏర్పడడం సాధారణమే. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

వేశాలమ్మకు మహా సారె సమర్పణ


సారె ఊరేగింపు

తిరుపతి కల్చరల్: గంగ జాతర సందర్భంగా యూనివర్సల్ క్యాటరింగ్ అధినేత పద్మనాభం శుక్రవారం రాత్రి వేశాలమ్మకు మహా సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 27 పళ్లాలలో అమ్మవారికి పసుపు, కుంకుమతోపాటు పట్టువస్త్రాలు, పండ్లు, పుష్పాలతో కూడిన సారెను డప్పుల మోతలు, భక్తజనుల నృత్యాల మధ్య శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయం నుంచి శ్రీవేశాలమ్మ ఆలయం వరకు సారె ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యూనివర్సల్ క్యాటరింగ్ అధినేత పద్మనాభం దంపతులు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ప్రేమ్‌నాథ్, సుబ్రమణ్యంరెడ్డి, చంద్రబాబు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామంతో రక్తపోటుకు చెక్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామంతో రక్తపోటు సమస్యను అధిగమించవచ్చు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతి రుయా నుండి ఎస్వీ మెడికల్ కళాశాల కూడలి వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. 40 ఏళ్లు పైబడిన వారికి ఆహారపు అలవాట్లలో సమూల మార్పులు అవసరమని చెప్పారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించాలంటే అందుకు సరైన ఆహారం తీసుకోవడం తప్పనిసరి అన్నారు. వైద్యుల సూచనల మేరకు ప్రతి ఒక్కరు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు శారీరక వ్యాయామం అవసరం అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ హరికృష్ణ , డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది లావణ్య, పద్మావతి, రూప కుమార్, ఇతర వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కృష్ణస్వామిరాజుకు దేవమ్మ బాలల కథా పురస్కారం


రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు



కథా పురస్కారం అందుకున్న కార్వేటినగరం కథలు పుస్తకం

తిరుపతి కల్చరల్: ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథలు పుస్తకానికి పలమనేరు శివేగారి దేవమ్మ బాలల కథా పురస్కారం లభించింది. ఈ మేరకు బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రతి ఏటా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు కేవీ మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పుస్తకంలోని కథలన్నీ భిన్న నేపథ్యాలతో, చక్కటి కొసమెరుపులతో, పిల్లల్ని ఆకర్షించే బొమ్మలతో నిండి ఉన్నాయి. తిరుపతికి చెందిన రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు ఇప్పటికే 150 పిల్లల కథలు రాశారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఈ కథలన్నింటినీ రచయిత రాజుగారి కథలు, రాణీ గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు అనే నాలుగు సంపుటాలుగా వెలువరించారు. వీటిలోని చాలా కథలు ఆలిండియా రేడియోలో పిల్లల కార్యక్రమంలో ప్రసారమయ్యాయి. ఈ పుస్తకంలోని అనేక కథల్లో పాత చిత్తూరు జిల్లా ప్రాంతాలు, విశేషాలు, చరిత్ర నేపథ్యాలు జానపద విశేషాలు విరివిగా కనిపిస్తాయి. ఈ కథా సంపుటాల పోటీకి న్యాయ నిర్ణేతలుగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డీకే.చదువుల బాబు, బాలసాహిత్య పరిషత్ కోశాధికారి పైడి మర్రి రామకృష్ణ వ్యవహరించారు.

యడమవారిపల్లెలో 73వ మహా భారత ఉత్సవాలు

- దేవుడు నడియాడిన భూమి యడమవారిపల్లె
- వారం రోజులుగా ఉత్సవాలు


శ్రీ ద్రౌపది అమ్మవారి ఆలయం

భాకరాపేట: జిల్లాలో చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె మహా భారత ఉత్సవాలు అంటే అందరికి సుపరిచితం. యడమవారిపల్లె గ్రామానికి దేవుడు నడిచిన, నిలిచిన ప్రాంతంగా ప్రశస్తి. 73వ మహా భారత ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు 50 మంది కార్మికులు నెల రోజులుగా ముస్తాబు పనుల్లో నిమగ్నమయ్యారు. మహా భారత ప్రాంగణంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లులో భాగంగా పగటి పూట నిర్వహించే హరికథా కార్యక్రమానికి వందలాది మంది కూర్చుని కథ వినేందుకు, వర్షం వచ్చిన, ఎండకు ఇబ్బంది లేకుండా పెద్ద షెడ్డును నిర్మించారు. అలాగే రాత్రి నాటకం వేసే స్టేజ్ నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో దాన్ని కూడా ప్రత్యేకంగా తయారు చేశారు. ఆలయానికి మెరుగులు దిద్దారు. అలాగే ఉత్సవాల్లో పలువురిని ఆకర్షించే విధంగా పలు రకాలుగా మహా భారత సన్నివేశాలతో కూడిన బొమ్మలను పెట్టించారు. విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలిపేలా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామాలకు భారతం శిలలు వెళ్లి ఊరూర ఉత్సవాలకు ఆహ్వానం పలికి వచ్చాయి.

ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు

జిల్లాలోనే యడమవారిపల్లె గ్రామంలో ఉన్న పలు దేవతా ఆలయాలు ఎక్కడా లేవని చెప్పవచ్చు. యడమవారిపల్లె గ్రామంలో మహా భారత ప్రాంగణంలో వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయం, పడమాలమ్మ, శ్రీకృష్ణ మందిరం, శ్రీభక్తాంజనేయ ఆలయం, శ్రీకోదండ రామాలయం, నాగదేవతలు ఆలయం, శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం, చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రం, పలు చిన్న చిన్న ఆలయాలు ఉన్నాయి.

తిరుమల పాదచారులకు విడిది క్షేత్రం

ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే పాదచారులకు విడిది క్షేత్రంగా మహా భారత ప్రాంగణం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా వెళ్లే భక్తులు ఈ ఆలయంలో విడిది చేసిన సందర్భంగా అమ్మవారిని పలు కోర్కెలు కోరుకుని నెరవేరడంతో భక్తులు ఉత్సవాల సమయంలో వచ్చి అమ్మవారికి విరాళాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు.

అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు పూర్తి

మహా భారత ఉత్సవాలు ప్రారంభం రోజు నుంచి వచ్చే భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటల చేపట్టే కార్యక్రమానికి భక్తులు విరాళాలు అందిస్తుండడంతో ఉత్సవ కమిటీ భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వరామంగా కొనసాగించేందుకు అవసరమైన చలువ పందిళ్లు వేయించారు. మహా భారత ఆలయ కమిటీ, శ్రీద్రౌపది దేవి ధర్మరాజుల స్వామి అన్నదానం సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అన్నదానానికి విరాళాలు ఇచ్చే దాతలు అన్నదానం అకౌంట్ నెంబరు 077511100000876, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌డీబీ0000775 నేరుగా అందజేయవచ్చనని కోరుతున్నారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం చిన్నకొట్టాయి ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. మొదట స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం, నైవేద్యం, దీపారాధన, హారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలోనే స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.